పడవలో

కపిల కాశీపతిరావు

చీకటి రాత్రి

"జంబైలే జోతు లంగరి" అని పాడుతూ మధ్య మధ్య ముక్కుతూ, మూలుగుతూ పడవ లాగే వాళ్ళు అట్లపాడు రేవులోంచి "ఎదురుపడవ కాసుకో" మని చుక్కాని దగ్గిర సరంగుని హెచ్చరించారు. పాలకొల్లు నరసాపురం కాలువ రహదారి పడవ నిడదవోలు రేవు విడిచిపెట్టి మడుగులో సాగుతూ ఉన్నది. చీకట్లో గట్టు మీద మనుష్యులు కనబడకపోయినా, మువ్వలకఱ్ఱ చప్పుడులో, ఇలకోడి కూతలలో, పడవ పాట మాత్రం వినపడుతూ ఉన్నది. పడవ కొంచెం విసురుగా నడవడము వల్ల రెండు పాయలుగా చీలుతూన్న నీళ్లు జలజలమని చప్పుడు చేస్తూన్నవి. పడవలో హాలులో కిరొసెన నూనె దీపం సీనారేకు తలుపులు గుండా పొగవిడుస్తూ, టాపుకి వేలాడుతున్నది. అటూ ఇటూ ఊగడంలో కీనీడ అణ్ణెంలో బస్తాల మీద, మనుష్యుల మీద గంతులువేస్తూ దాగుడు మూతలాడుతూన్నది. ఆ బస్తాల మీదే కొందరు, అడ్డ చెక్కల మీద కొందరు, ఎవరికి దొరికిన చోట్లో వారు, ప్రయాణీకులంతా నిద్ర సేవిస్తున్నారు.

ఎంత జోగినా పడవలో ఒక వైష్ణవుల ముసలావిడకు మాత్రం నిద్ర రావడము లేదు. లేచి కూర్చుని చీకట్లో ఏమిటో చూస్తూ ఆలోచిస్తూన్నది. దూరముగా గట్టు మీద దొరల బంగళాలో దీపము వెలుగుతూన్నది. దాని ప్రతిబింబమే కాలువలో మెలికలు తిరిగి ఉయ్యాల లూగుతున్నది. పెద్దతనము వల్ల కునుకు రాక ఆవిడకు ఏమీ తోచడం లేదు. ఎవరైనా మాట్లాడేటందుకు దొరికితే బాగుండుననుకొన్నది. ఆవిడకు దగ్గిరగానే కొంచెం వెడంగా ఒక రెడ్డి చిన్నది తల కింద చిన్న మూట పెట్టుకుని ముడుచుకుని పడుకున్నది. ఇంతలో అణ్ణెంలో బస్తాల చాటు నుంచి "క్యార్ క్యార్" మని చంటిబిడ్డ ఏడ్పు వినబడినది. నిద్రపోతూ ఉన్న రెడ్డి మనిషి ఉలిక్కిపడి లేచి కూర్చున్నది. కళ్లు నలుపుకుని, సంరక్షణ లేక రేగి ఉన్న తల వెండ్రుకలు అటూ ఇటూ సర్దుకుని నిద్రలో చెదిరిన పమిటె కొంగు సరిచెసుకొని ఆ పక్కా ఈ పక్కా చూస్తే ఏమీ లేదు. ప్రయాణీకులంతా నిద్రాభంగం కావడం వల్ల కొంచెం కదిలి ఆ పక్కకు తిరిగో, కాళ్లు ముడుచుకునో మళ్లీ నిద్ర పట్టించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. పడవలో కొంచెం అలజడి జరిగినది. ఒక క్షణంలో అంతా నిశ్శబ్దం. పడవ నడుస్తూన్నది. దూరంగా ఉన్న శెట్టి పేట 'వయిరు' హోరు, మువ్వల కఱ్ఱ చప్పుడు, ఇల కోడి కూత; - మరేమీ లేదు. పడవ పాట ఆగిపోయినది. ఆ అమ్మాయికి ఎదురుగా మేలుకుని కూర్చున్న ముసలమ్మ పడవ కిటికీలోంచి చూస్తే చీకట్లో పొడుగ్గా ఎత్తుగా గుబురుగా పెరిగిన నిద్రగన్నేరు చెట్లు

గట్టు మీద పెద్ద కొండలలాగ ఉన్నవి. చెట్ల ఆకుల్లో మిణుగురు పురుగులు మెరుస్తున్నాయి. చల్లని గాలిలో అప్పుడప్పుడు నిద్రగన్నేరు పువ్వులు వాసనేస్తున్నాయి. ఆ మనిషి లేచి కిటికీ దగ్గిరకు వెళ్లి నిలుచున్నది. నిర్ఘాంతపోయి, అర్థం లేకుండా అల్లాగే నుంచుని చీకట్లోకి చూస్తున్నది. ఆ మనిషి వైఖరీ అంతా చూస్తే ముసలమ్మకు నిద్రలో తెలియకుండా లేచి పరుగెత్తే జబ్బుమనిషిలా కనుపించినది. ముసలమ్మకు మాట్లాడాలని మనసులో వున్నా పలుకరించలేదు. ఇంతలో ఏదో పై నుంచి కాలువలో పడి గుభాలున చప్పుడైంది. రెడ్డిపిల్ల మళ్లీ ఉలిక్కిపడి వెనక్కు తగ్గి, "అయ్యో? అదేమిటీ?" అన్నది. పైన చెట్లలో కీచుకీచు మని చప్పుడు, గబగబా కొమ్మలన్నీ కదలిపోయినవి. నిద్రలో ఉన్న కొమ్మల్లో కోతులన్నీ మేలుకుని గందరగోళం చేస్తున్నవి. "కోతి పిల్లేమో, నిద్దట్లో పట్టుజారి పడిపోయిం" దన్నది ముసలావిడ. "శివశివా! పాపం!" అని పడిచెక్క మీద చేతులాని కాలువలోకి వంగి చూసింది తూరుపు చిన్నది. పడవ అప్పుడే ఆ చోటు దాటిపోయినది. కాని నీళ్లలో ఎవరో ఈదుతూ ఉన్న చప్పుడు వినబడింది. మరి కాసేపటికి కోతులు కిచకిచలు, కొమ్మల గలగలలు తగ్గిపోయినవి.

"చచ్చిపోలేదు. ఈదుకుని గట్టెక్కినట్టుంది. పాపం!" అన్నది ముసలమ్మ.

"దాని తల్లెంత ఏడ్చునో నమ్మా, పాపం!" అన్నది రెండోమనిషి.

"అవునమ్మా! కోతి అయితే ఏం కొండముచ్చైతేనేం, ఎవరికడుపు వారిది."

"అదే మనుషులైతే ఇంకేం వుందండి ఆశ? ఈపాటికే బుడుంగుమందురండి."

"అందుకనే, నోరూ వాయా లేని జంతువు కనకనే అన్ని ఉపాయాలూ పుట్టుకతోనే పెట్టేడు శ్రీ మన్నారాయణమూర్తి."

"శివుడాజ్ఞ లేందే చీమన్నా కుట్టదన్నారండి" అన్నది, తను కూడా ఏదో మాట్లాడాలి గదా అని, రెడ్డిపిల్ల. కాసేపు వారు మాట్లాడలేదు. శ్రీరంగనీతులు, శివ పురాణం అంతటితోనే ఆగిపోయినవి. ముసలమ్మగారు ముభావంగా ఊరుకున్నది. ఆ కోతి పిల్ల సంగతి ఆవిడ ఆలోచించినట్టే లేదు. ఆ చిన్నది మాత్రం నివ్వెరబోయినది. ఎవరో "కడుపులో చెయ్యెట్టి కలిపేసినట్టు" కలవరపడుతూ ఇంకా నుంచునే చూస్తున్నది. నిద్రపోతూ ఉన్న ప్రయాణీకులికి చచ్చి బతికిన ఆకోతి పిల్ల సంగతి ఎందుకు? శివనామం విని విష్ణుజపం చేసుకుంటూన్న ముసలమ్మకు మాత్రం ఎందుకు? ఈపిల్ల మాత్రం అదృశ్యం మర్చిపోలేకపోయినది. అసలది ఎందుకు జారిపోవాలి. ఏమో తనకి ఏం తెలుసు? ఎవరికి మాత్రం ఏం తెలుసు? చిన్నప్పుడు వాళ్లమ్మమ్మ చెప్పింది, కోతిపిల్ల పట్టుజారి విడిపోతే తల్లి దాన్నింక తాకదని, నిజమేమో. అనడమే కాని ఎవరు చూశారు? అంత విచిత్రం వుంటుందా ఎక్కడన్నా? ఏమయినా సరే, కన్నతల్లి ఊరుకోలేదు. తనకళ్ల ముందు ఆ పసికూన కీచుకీచుమని ఏడుస్తోంటే ఎంత కోతి అయితే మాత్రం ఊరుకుంటుందా? తీసుకుంటే తక్కిన కోతులన్నీ పీకి చంపేస్తాయేమో! తన ప్రాణమన్నా యిస్తుంది గాని కన్నపిల్లని చంపుకుంటుందా? అని ఈ విధంగా తర్కవితర్కాలు చేసుకుంటూ నుంచున్నది. ఆ మనిషిలో అప్పుడు చలనం లేదు. గుడ్డి లాంతరు వెల్తురులో ఆమె నల్లనివళ్లు నిగనిగలాడు తూన్నది. ముతకగా వున్న చీరె పమిటెకొంగు చాటున ఆవిడ గుండె కొట్టుకొంటున్నది. ఆ పిల్ల వక్షము చిన్న కెరటంలాగున అలలుగా ఊగుతూ ఉన్నది. మధ్య మధ్య చేతులతో ఏదో అక్కడ బాధగా ఉన్నట్టు

నిమురుకొంటూంది. తల కొంచెం అటూ ఇటూ కదిలినప్పుడు ఆ ముఖంలో కళ్ళుమాత్రం దీపం ముందు మిల మిల లాడుతున్నవి. మాట్లాడినప్పుడు దీనంగా ఉన్నది. కేవలమూ ఏడ్చినట్టుంది కాని, ఏడవడం లేదు. చూడగానే ఆ వ్యక్తి దూరపు ప్రయాణం చేసినట్టూ, దుఃఖాల పాలైనట్టు స్పష్టముగా తెలుస్తూన్నది. తెలుపరాని, తెలుపలేని అవ్యక్తపు టుద్రేకములు ఏవో ఆహృదయములో దహించుకు పోతూన్నట్టు చూచాయగా తెలుస్తుంది. ఆ చిన్న దాని సర్వవైఖరీ సానుభూతికోసం ప్రపంచాన్ని దేవురిస్తోన్నట్టున్నది. పెద్దవయసులో రేచీకటి గమ్మి ముసలావిడకు కొంచెం ఎల్లాగో ఉన్నా తన యెదుట ఉన్న వ్యక్తి ఒక నిర్భాగ్యురాలని తట్టలేదు. అయినా కొంచెం తోచక, కొంచెం ఎదురుగా మనిషి ఉన్నప్పుడు వూరుకోలేక "ఏ వూరమ్మీ" అన్నది. ఆ పిల్లకు వినబడలేదు. "ఓ అమ్మాయి, నిన్నే".

"ఏమిటండి?"

"ఏవూరు అంట."

"ఏవూరని చెప్పమన్నా రమ్మా?"

"నే చెప్పమన్న వూరు చెబుతా వేమిటి? అసలేవూరో అని అడిగాను. పూర్వోత్తరపుదాన్ని, తల్లీ! నా కేమీ చమత్కారాలు చేతకావు."

"శమత్కారం కాదండి పెద్దమ్మగారు. నా గ్రహశారం అని మనివి చేస్తానండి."

"ఇంతచిన్న తనంలో అన్ని కష్టాలెక్కడ పడ్డావు, నా తల్లీ? చూస్తే ఇరవైయేళ్ళు లేవు. 'నా' అని చెప్పు కునేటందుకు ఇంత ప్రపంచంలో ఊరే లేకపోయిందా?"

" 'నా' అనేవోళ్ళోరుంటే ఊళ్ళేలినంత ఫలమండి."

"ఏ అమ్మా, ఏ నాన్న కని పడేశారు తల్లీ, నిన్నూ? ఇంతమంది ఉండగా నీఒక్క ప్రాణమే బరువైపోయిందా అందరికీనీ?"

"............"

"ఏవూరునిం చొస్తున్నావు?"

"రంగాన్నించండి."

"అదుగో అల్లా చెప్పు. సర్వకష్టాలూ అక్కడే ఉన్నాయి ఈ రోజుల్లో . శుభంకోసం వెడితే కష్టం యెదురుగా వచ్చిందిట. ఏదో నాలుగు డబ్బులు చేసుకుందామని అక్కడికి పోతే, వాళ్ళ కొచ్చింది పోయేకాలం. అయితే వొచ్చేస్తున్నారుటగా అక్కణ్ణుంచి మనవాళ్ళంతా?"

"మనిష్ట మేంటండి? అళ్ళే ఎల్లగొట్టేశారండి. ఏదైనా ప్రాణం తీపు గాదండి, చచ్చినాళ్ళు చావగా దక్కినాళ్ళు తిరిగొచ్చేశారండి."

"మరి మా ఊర్నుంచి పోయినవాళ్ళు చాలాకాలం కిందే తిరిగొస్తే మీ రింత ఆలస్యంగా వొస్తున్నా రేం?"

"మేం వెవరండి? నేనొక్కదాన్నేనండి" అని చెబుతూ చెప్పలేక ఆ పిల్ల పొడిదగ్గు దగ్గింది.

"పోనీ నువ్వే, ఇంత ఆలశ్యంగా తిరిగొచ్చావేం?"

"ఆడే వుండిపోదా మనుకున్నానండి. మరుండ నియ్యలేదండి. తండ్రి! ఆయన లేరండి, నారాయణ రావుగారు, బలవంతంగా అందర్నీ పంపించేశారండి. అయినా ఇక నుంటే కోరింగాళ్ళని బతకనిచ్చేటట్టు లేదండాళ్ళు."

"అస లెందుకొచ్చిందీ రగడ?"

"ఏం లేదండి, వడ్లగింజలో బియ్యపు గింజండి. అదేశపాళ్లంతా సమ్మెకడితే మనోళ్లు తక్కువ ధరకి పని కెళ్లారండి."

"వీళ్లెడితే వాళ్లకెందుకూ?"

"కూలి నష్టంకాదండి అళ్లకి? కూలి సంఘానికి మర్యాద లేదండి? సావుకారికి పనిమనిషి లోకువైతే బతకనిస్తాడాండి మళ్లీని? అస లింక రాబోయే రాజ్యమే పనివోళ్లదంటండి. ఇంతకీ మనవాళ్లు చేసింది కూడా బుద్ధి తక్కవేనండి.".

"అదేమన్న మాట, పొట్లాటన్నప్పుడు రెండిందాల లోటుపాట్లుంటాయి. మనవాళ్ళని మాత్రం ఏమనంటాం మనం? ఆడవాళ్లకి తెలియని సంగతులు అనేకం ఉంటాయి."

"మీరు శెలవిచ్చిన మాటా నిజమేనండి. కాని ఈ సందర్భంలో ఇంతేనండి. నేను మాత్రం పనిమనిషిని కానేంవిటండి? అందుకని మనవి జేస్తానండి."

"పోన్లే, ఎవళ్లెల్లా పోతే మన కెందుకు? బతుకుంటే బలుసా కన్నట్టు దేశం కాని దేశంలో, ఎక్కడో కాస్త్రప్రాణం వాళ్లచేతులో హరీ అనకుండా, ఎవరింటి పట్టున వాళ్లుకలో గంజో తాగి పడిఉండొచ్చు. పాపిష్టి డబ్బు సంపాదిస్తే ఏం, లేకపోతే నేం, బతికున్న నాలుగురోజులు సుఖం లేకపోయాక?"

"ఇల్లూ వాకిలీ లేనివాళ్ల సంగతేం చెబుతారండి?

"అదేంవిటమ్మా మరీ అంతశోద్దింగా చెబుతావు? ఇల్లే లేకపోతుంది? కట్టుకున్నవాడు నువ్వూ ఎక్కడుంటే అక్కడే ఇల్లు."

"అదుంటే ఈ ఆపసోపా లెందుకండి? అందర్నీ ఆయములాళ్లకే వప్పగించానండి. నాకర్మం..."

ఇంతలో ఆపిల్లకు పొడిదగ్గు వచ్చింది. మాట్లాడలేక పోయింది. పక్కన ఉన్న బస్తామీద చతికిలబడినది. వెంటనే అబస్తామీదే వొరిగిపోయింది. ఆ పిల్ల ఏడుస్తోంది. ఇంతవరకు ఈ మనిషి విషయమై కొంచెం అపోహలో ఉన్న ముసలమ్మ మనస్సు చలించినది. "అయ్యో, పాపం మంచిదే పిల్ల" అనుకున్నది. ఇంక ఊరుకోలేక వోదార్చింది. "అయ్యో! అయ్యో! ఇంతట్లోనే దుఃఖం ముంచుకొచ్చింది. నీ కెన్నికష్టాలు నెత్తిన బడ్డాయోనమ్మా? ఊసుపోక కదిలించాను. తలుచుకునే సరికి కడుపు చెరువైపోయింది గావునే తల్లీ?"

ఆ అమ్మాయికి ఊరడించే సహృదయురాలు కనబడేసరికి మొదటి తెర దుఃఖం కొంచెం ఆగింది. కళ్లు తుడుచుకుని గొంతుకు సవరించుకుని, "మీ రేం చేశారు దొడ్డమ్మగారు? ఎవరికర్మాని కెవరు కర్తలు? చెప్పుకుని ఏడ్చేటందుకు కూడా ఎవరూ లేక ఎవరన్నా మాట్లాడితే చాలని నే నున్నానమ్మగారు మొహంవాచి. ఒక మాటన్ని కష్టాలు వెళ్లబోసుకుంటేనన్నా బరువు తగ్గుతుంది."

"గుండె నిబ్బరం గలదానవు గనక నెట్టుకొచ్చావమ్మా. ఇదే మా బ్రాహ్మణపిల్లలైతే కడుపుబద్దలై చచ్చేవారు, ఏ నుయ్యో గొయ్యో చూసుకుని."

"కష్టాలొస్తే ఎవరన్నా భరించాలండి. అంతకంటె చేసే దేంవిటండి?"

"అదీ నిజమేనమ్మా! మళ్లీ నిమిషాని కొచ్చే దేంవిటో తెలియదుగదా!"

"ముమ్మాటికీ నిజంవండి. సరిగ్గా రెణ్ణెల్ల క్రితం కష్టం అంటే ఏంవిటో ఎరగనండి. నాకేం ఫరవా అని తలయిసురుగా తిరిగేదాన్నండి. మాయమ్మని, మానాన్నని, యెరగనే యెరగను గదాండి. మాయమ్మమ్మ పెంచి పెళ్లిచేసిందండి."

"ఏవూరిచ్చా రమ్మా?"

"మా మామయ్యే నండి - పొట్ట నెట్టుకున్నారాయ ములాళ్లు. ఆ రంగం గడ్డలో రాసింది గావున్నండి గండం. బుద్ధెరిగాక మామయ్య నిడిచి పెట్టుండలేదండి. చిన్న నాటి నుంచి ఒకంచంలో తిని ఒదిక్కున పడుకున్నామండి. ఈ పోలాల మావాశకి సరిగ్గా మూడేళ్ల వుద్దండి రంగాని కెళ్లి. మూడేళ్ల బతుకూ మున్నాళ్ల ముచ్చటైపోయింది గదా! పది నెల్ల పిల్లాడండి, మళ్లీ తండ్రేనండి, అణ్ణి చూసుకునేటందుక్కూడా, ప్రాప్తి లేకపోవాలాండి?"

"ఎన్నాళ్లు విచారిస్తే ఏం లాభం? పోయిన వాళ్లకి మళ్లీ ప్రాణం పొయ్య లేంగదా! ఆర్చేవి తీర్చేవి, ఓ నాటివి, రెన్నాళ్లవీ అయితే అనుకోవచ్చు, ఎల్లకాలం బతుకు బతుకంతా ఉండేవాట్ల ఉస్సురని వాపొయ్యడం తప్ప మనం చేసే దేముంది? మరీ అంత విపరీతంగా, కట్టుకున్న మొగుడూ, కడుపున గన్న బిడ్డా ఇద్దర్లో ఒకరన్నా ఉండకుండా పోవాలి?"

ఆసమయంలో ఇందాకా ఏడ్చిన చంటిపిల్ల ఏడ్పు మళ్లీ వినబడినది. రెడ్డిపిల్ల మళ్లీ ఉలిక్కి పడింది. తెల్లబోయి చీకట్లోకి చూసి ఆలోచిస్తూన్నది. పెద్ద ప్రాణం. అందులో ఆడది. ఈపిల్ల పడే హృదయ వేదన ముసలమ్మగారు గ్రహించినది. దిక్కు మాలిన పక్షి, దీన్ని ఈ విధంగా వదిలెయ్యకూడ దనుకున్నది.

"ఇదుగో పిల్లా, నీ పేరేమిటీ అన్నావు?"

"మాణిక్యంవండి."

"అయితే, మాణిక్యం, నివ్విప్పు డెక్కడికెడదామని?"

"మాయమ్మమ్మగారి ఊరండి?"

"మీ అమ్మమ్మ ఉంటే ఇకనే. ఫరవాలేదు, పాపం."

"అమ్మమ్మా లేదు, కొమ్మమ్మా లేదండి. మేం దేశ మిడిచిపోక మునుపే పోయిందండి మాయమ్మమ్మ."

"మరి ఇక నక్కడి కెందుకు నువ్వు?"

"నే నెరుగున్న ఊరది కాక మరి లేదండి. ఇంకేం చెయ్యనండి?"

"మావూరొస్తావా తీసుకెడతాను?"

"నా కన్నివూళ్లు సమానమేనండి. ఓవూ రెక్కువ లేదు, మరోవూరు తక్కువ లేదు. ఎక్కడుంటే నన్నడిగేవా రెవరండి? ఇల్లాగే ఎక్కడో తల దాచుకుంటే ఎప్పుడు విసుగుపుడితే అప్పుడే వుందండి దారి."

"ఏదారి?"

"గోదారండి. నాబిడ్డ, నాదేవుడూ ఎక్కడుంటే అక్కడికే నేనూ పోతానండి."

"చిన్నతనం చేత అల్లా అనిపిస్తుందమ్మా. అఘాయిత్యపు మాటలు అనుకోకూడదు. దిక్కు లెనివాళ్ళకి దేవుడే దిక్కు. నీ కొచ్చిన ఫరవా ఏమిటో చూస్తాను నాతో రా."

"పెద్దోరు. మీకంటె నాకెక్కువ తెలుస్తదాండి? ఆ మాత్రం ధైర్యం చెప్పి సలహా ఇచ్చేవాళ్ళు లేకనేనండి నా ప్రాణం అడిలిపోయింది."

చంటిబిడ్డ ఏడ్పు మళ్లీ వినబడింది.

ఆ ఏడ్పుతో ఆ చిన్న దాని ప్రాణం లేచివచ్చింది. మళ్లీ వెంటనే ఎక్కడికో పోయింది. ఇరవయిమూడు రోజులయింది చంటిపిల్ల ఏడ్పు విని. తన కడుపుని కనుక్కుని ఏటి కేడాది పెంచి గంగలో కలిపింది. పోనీ మొగుడు పోతే అతని పేరుమీదుగా కొడుకుని పెంచుకుని ఏకూలో నాలో చేసుకుని జీవయాత్ర సాగిద్దామనుకుంటే, అది కూడా కరువయిపోయింది. తన కెవరు ప్రపంచంలో ఇంక? ప్రపంచానికి తనెవరు? మాణిక్యం అనేమనిషి ఎందుకింక? ఒక దిక్కు మాలిన ఇల్లాలు, ఒక కడుపుగాలిన తల్లి, చచ్చినావకటే, బతికున్నావకటే, తన వూరు - తనవూరెక్కడ? వాళ్లమ్మమ్మ తననీ, తన మామని పెంచిన పల్లెటూరు వెడితే అచచ్చిపోయిన కాతర్లేని ముసలిదాని రంగమెల్లిన మనుమరాలని ఆదరించేవా రెవరూ? ఆ చీకట్లో, అనల్లని నీళ్లలో ఎవరికీ తెలియకుండా పడవలోంచి జారిపోతే ఏం? లోకానికి నష్టమేంవిటి? తనకన్నీళ్లు కాల వయితే ఒకకాలువ నష్టం. తనకడుపు చెరువైతే ఒక చెరువు నష్టం. ఒక దౌర్భాగ్యురాలు లేకపోవడం ప్రపంచానికి లాభం. ఒక దుఃఖం అయితే అనుభవించవచ్చు. గోరుచుట్టు మీద రోకటిపోటన్నట్టు ఒక దాని మీద వకటి. పోనీ, సంసార సుఖం అంతే చాలనుకుంటే కడుపునికని చేతులతో ఏటికేడాది పెంచి, వళ్లో పాలు తాగే పిల్లాణ్ణి చూసుకునే సౌఖ్యం అన్నా ఉంచకూడదు? ఇరవయి మూడురోజు లయింది బిడ్డ ముఖం చూసి, ఆ ఏడ్పు విని, ఆ చిన్న చేతులు తనవంటికి తగిలి, ఆ పళ్ళు లేని బోసినోరుతో తనపాలు తాగి, ఇరవయి మూడు రోజుల నుంచి పొంగిపోయే దుఃఖంతో అపాలు కూడా పొంగిపోతున్నాయి. ఎవరికి తెలుస్తుంది, అబాధ. ఒళ్లో బిడ్డ వాలికిపోయిన తల్లి ప్రాణం తప్ప సానుభూతి చూపించడానికి శక్తులెవరు? ఆకలికి కడుపు ఓర్వలేనట్టు, ఈ వింత ఉద్రేకానికి తల్లి ప్రాణం ఓర్వలేకపోయింది. మానవ ప్రపంచంలో ఏయంత్రం వల్ల, ఏతంత్రం వల్ల, ఆ లోటు తీర్చగలరు? మనుష్యులు అనుకునేటట్టు మందబుద్ధులయిన పశువు అయితే, ఏ చేత పెయ్యో చేసి తన దూడ అనుకుని అది చేపిన పాలు దగా చేసి పితికి మనం తాగెయ్యవచ్చు. కాని బుద్ధిగల ఈమనిషికి మారుమందేది? ఇంతకష్టం మనకి కలిగించే బుద్ధి ఉండడం కంటె లేకపోవడం సుఖం కాదూ? తనవళ్లో పడుకుని, కాళ్ళ ఆడిస్తో, చేతులతో శరీరం నిమురుతో, పమిటె కొంగులోంచి దోబూచులాడుతో, పిల్లవాడు తాగవలసిన పాలు, తన చేతులారా పిండి మట్టిపాలు చెయ్యవలసిన అవుసరం ఏతల్లి భరించగలదు? లేక తన హృదయంలో ఈ పొంగుబాలు దాచుకుని ఆ బాధ ఏతల్లి భరించగలదు? పిల్లలతో తల్లుల్ని, తల్లులవళ్లో పిల్లల్ని చూచినప్పుడల్లా ప్రాణం పోతుందే! ఎక్కువైన తల్లి తనకో శిశుదానం చేసుకోకూడదు? అనుకోవడమే గాని ఎవరికి మాత్రం పిల్ల లెక్కువ? అని ఏమేమో ఇదే విధముగా మాణిక్యం మనసులో కుళ్లిపోతూన్నది.

పడవలో పిల్ల ఏడ్పు ఆగలేదు. అంతకంతకు ఎక్కువైపోతూంది. కడుపు చెక్క లయ్యేటట్టు బస్తాల చాటునుంచి ఏడుస్తోంది బిడ్డ. మాణిక్యం శరీరంలో ఒక్కొక్క ఏడ్పు ఒక్కొక్క శూలంలాగున తగులుతూన్నది. సగం ఆ పిల్ల అవస్థ చూసి భరించలేక, మరిసగం తనస్వంత అవస్థ జ్ఞప్తికి వచ్చి ఆరెడ్డి పిల్ల మహాక్షోభ అనుభవిస్తూంది.

పడవలో ఎవరికీ నిద్రపట్టడం లేదు. ముసలమ్మ గారికి కూడ విసుగువేసింది. ఇంక ఊరుకోలేక, "ఎవరమ్మా, మాయమ్మతల్లి, ఇందాకణ్ణుంచి అవరసని ఏడుస్తూంటే ఏం చేస్తోంది తల్లి? అదేమినిద్ర మాయనిద్ర? కాస్త అడ్డాలో వేసుకోకూడదూ? ఓమాటు నమల బెడితే ఊరుకోదూ పిల్ల?" అంది.

ప్రయాణీకుల కందరికీ ముసలమ్మ మంచిమాటే అన్న దనిపించినది. కాని ఆ మాట ఆ తల్లికి వినిపించినట్టు లేదు. వినిపించినా వినిపించకపోయినా, పిల్లో పిల్లాడో ఏడుపుమాత్రం మానలేదు. వెక్కి వెక్కి ఒకటే యేడ్పు.

"ఏగాలో, ఏధూళో నమ్మా. బిడ్డడిలి పోతోంది పాపం! " అన్నది మాణిక్యం.

"అవునమ్మా. ఏదృష్టో, ఏదోషమో! అల్లా ఏడవ కూడదు చంటిపిల్లలు."

"మరి అప్పుడప్పు డల్లా పోరుపెడతారండి పిల్లలు. ఏంచేసినా ఊరుకోరండి."

"కని పెంచిందానవు కనక తెలుసునమ్మా కష్ట నిష్ఠూరాలన్నీ. అయ్యో! అయ్యో ! ఇంకా ఊరుకోదేం, ఆ పిల్లో పిల్లాడో? కాస్త తీస్తావు, ఆ తెల్లి రెండు మంత్రం ముక్కలు చెబితేనన్నా తగ్గుతుందేమో?"

"అంతకన్నా నాండి. నేను కూడా అందా మనుకుంటున్నానండి అసంగతే. ఊరుకోబెడితిరాంటే మీ పుణ్యం ఈరాత్రి."

"మనచేతులో ఉన్నదాని కేంలోటమ్మా. పద అదీ చూద్దాం."

"అందరిమనుసు అల్లా ఉంటుందాండి మరి? ఎవరెల్లా పోతే ఎవురికి కావాలండి? మనుసు మంచిదవాలండి అసలు."

వారు వెళ్లేసరికి అక్కడ ఒక వింతదృశ్యం. ఇంత వరనుంచి ముసలమ్మగారు మందలించిన తల్లి అక్కడ లేదు. అక్కడే కాదు, ఎక్కడా లేదని నెమ్మది మీద వాళ్లు గ్రహించారు. కొంచెం దళసరిగా గుబురుగా పెరిగిన పల్లెటూరి క్రాఫింగుతో చొక్కా చేతులు పైకి తీసుకుని, కాళ్ల మీద పడుకుని ఏడుస్తున్న పిల్లవాణ్ని సముదాయిస్తూ ఒక పురుషవ్యక్తి ఉన్నది. ఎంత తంటాలు పడినా పిల్లవాడు ఊరుకోడు. పక్కన రెండుమూడు చిన్నెగిన్నెలు, చెంచా, వేడినీళ్ల సీసా, పాలబుడ్డి, వగయిరా సరుకులన్నీ పెట్టి ఉన్నాయి. పిల్లవాడు ఒకటే ఏడ్పు. కడుపక్కళించుకుపోయింది. డొక్క లెగరవేస్తున్నాడు. వెళ్లిన ఆడవాళ్లిద్దరూ నోటమాట లేకుండా నిలువబడిపోయినారు. తల్లి ఉన్నదని భావించి తానన్నమాటలన్నీ జ్ఞాపకం వచ్చి ముసలమ్మ చిన్నబోయినది. ముసలమ్మగారి పశ్చాత్తాపము కంటె, పిల్లవాణ్ణి సముదాయించలేక ఆ మగవాడు పడే అవస్థకంటె, పిల్లవాడు ఆకలిచేత ఏడుస్తూ పడేబాధ కంటె, మాణిక్యం స్థితి కష్టంగా ఉంది. ఆవిడ శరీరములో ఉన్న సర్వ రక్తనాళములూ, ఆపాదమస్తకమూ, జల్లుమని పోయినవి. అని ఊరుకోలేదు. అల్లా అంటూనే ఉన్నాయి. తల బరువైపోయింది. కాళ్లు చేతులు వణికిపోయినవి. పిల్లదుఃఖం తల్లికి తెలుసును. తల్లి లేని పిల్లవాడి కడుపుబాధకంటె పిల్లపోయిన తల్లి కడుపుబాధ అధికం.

పాపం! ఆ మగవాడు వీరిని చూసినట్టు లేదు. చూసినా, మగవాడు, ప్రస్తుతస్థితిలో తనంతట తానుగా పరాయస్త్రీలను ఏమని పలుకరిస్తాడు? నివ్వెరపాటు అణిగిన తరువాత ముసలావిడ ధైర్యం చేసి మాటలు ప్రారంభించినది.

"నేను పట్టుకుంటాను నాయనా, నువ్వు పొయ్యి" ఆ పురుషుడు తల యెత్తేసరికి ఆవిడ మరింత తెల్లబోయినది. పూర్వపరిచితుడే.

"మాది రెడ్డివారి రామన్నవు గాదు నాయనా నువ్వూ? విన్నాను నాయనా, విన్నాను. కన్నుల పండువగా ఉండే నీ సంసారం ఎంతలో చితికిపోయిందీ ! నీ ప్రారబ్ధమే ఇల్లా కావాలి! నిన్న గాక మొన్న గడపలో కొచ్చిన పిల్ల అదే పోవాలి! చిలక, బంగారు చిలక. అంత బుద్ధిమంతురాళ్లుండరమ్మా. పోయింది పోగా నీ ప్రాణానికీ పసికూనొకడు. ఎంత పోట్లాడుకుని ఎంత విరోధాలైనా, ఇదివర కెంత రాకపోకల్లేక పోయినా, ముతవతల్లి తీసుకెళ్లకూడదూ? కూతురు పోయాక, కూతురు బిడ్డకంటె కావలసినా వాళ్లెవరూ?" అని, ఓదార్చడం, సముదాయించడం, సలహా ఇవ్వడం అన్నీ ఒక ఉపన్యాసంలోనే చెబుతూంది ఆవిడ. ఈవిడ మాటలతో పసిబిడ్డ ఏడ్పు మానలేదు. రామన్న దుఃఖం తీరలేదు.

"పాల్లేవూ?"

"పాలు కాదండి, ఇదేదో 'హార్లి'క్సండి. సీసాలో నీళ్లు చల్లారిపోతే ఎల్లాగా కలపడం అని ఆలోచిస్తున్నానండి."

"అయ్యో, పడవలో, చుక్కాని దగ్గిర పొయ్యిలో నిప్పు లుంటాయి. వెచ్చ జేసుకుని రా, నాయనా, దబ్బుని; పిల్లాడిప్రాణం అడలిపోతోంది. ఇలాతే, పిల్లాణ్ణి నేను పట్టుకుంటాను." రామన్న గిన్నెలు తీసుకుని చుక్కాని దగ్గిరకు వెళ్లినాడు. పిల్లవాడు ముసలమ్మ చేతుల్లో ఏడుస్తున్నాడు. మగవాడు అవతలకు జారగానే మాణిక్యం మనసు ఊరుకోలేకపోయినది. గభుక్కుని చతికిలబడి, ఏమీ మాట్లాడకుండానే పెద్దావిడ చేతుల్లో పిల్లవాణ్ణి లాక్కుని వళ్లో వేసుకున్నది. ఇంతసేపటి నుంచి అంత గందరగోళం చేసిన ఆ చిన్నపిల్లాడు మరుక్షణంలో నిశ్శబ్దం అయిపోయినాడు. తనతల్లి బతికున్నపుడు వళ్లో పడుకుని చన్ను గుడిచి పాలు తాగడానికి అలవాటుపడ్డ ఆ చిన్న బిడ్డ ఆత్రంతో పాలు తాగుతున్నాడు. తనబిడ్డ బతికి ఉన్నప్పుడు వళ్లో పెట్టుకుని, చన్ను గుడిపి పాలు ఇవ్వడానికి అలవాటు పడ్డ తల్లి ఆత్రంతో పాలిచ్చినది. అరవయి సంవత్సరాలు నిండినా తనయావజ్జీవమూ ఇటువంటి దృశ్యము చూడని ముసలమ్మ నిర్ఘాంతపోయింది. ఎందుకో అమిత ఆనందం అనుభవించింది. ఇంత విపరీతముగా ఉన్నా ఆదృశ్యంలో అసామాన్యం ఏమీ ఆవిడకు కనబడలేదు. ఎటువంటి వ్యవహారంలోనయినా, ఆలోచించకుండా అమాంతంగా, అభిప్రాయం వెలిబుచ్చేటటువంటి మనిషి, ఏదో ఆలోచిస్తూ కళ్లప్పజెప్పి చూస్తున్నది. తల్లీబిడ్డ లిద్దరూ వాళ్లలోకంలో వాళ్లున్నారు. వాళ్లకీ గొడవే అవుసరములేదు. "నీకోసమే సుమా ఏడ్చాను" అన్నట్టుగా పిల్లవాడు ఊరుకున్నాడు. "నీకోసమే నాయనా, ఇంత ఆవేదన పడ్డాను" అన్నట్టు తల్లి సంతుష్టిగా పాలిచ్చింది.

రామన్న వస్తాడేమో మాణిక్యం సిగ్గుపడుతుందని ముసలావిడ పడిచెక్క దగ్గిరకు వెళ్లి అతన్ని ఆపడానికి నుంచున్నది. ఆ కాచిన నీళ్లు కాసిన్నీ తొణికి పోకుండా జాగ్రత్తగా పట్టుకుని రామన్న వచ్చాడు. "ఊరుకున్నాడాండి" అని అడిగినాడు ఆదుర్దాగా. "పోయినతల్లి లేచి వచ్చినట్టుగా ఆ మాయిల్లాలు ఒళ్లో వేసుకుంటే ఊరుకోడు నాయనా?". రామన్న ముఖం విప్పారింది. అతని హృదయంలోఉన్నబరువంతా జారిపోయింది.పాలక్కడ బెట్టి, "అబ్బ, మీధర్మమండి అవ్వగారు" అన్నాడు. "నే నేం జేశాను నాయనా! అదుగో ఆ పిల్లధర్మం" అంది ముసలమ్మ. "వెయ్యివేలద

ణ్ణాలండి. మీ కడుపున పుడతానండి మళ్లీజన్మాన." "దాని కేం గాని ఇదుగో...." అని ముసలావిడ రామన్నతో దీర్ఘంగా ఏవో గుసగుసలు సాగిస్తూంది. అతనంతా వింటున్నాడు. వాళ్లిద్దరూ చాలాసేపు అల్లాగే మాట్లాడినారు. కడుపు నిండిన పిల్లవాడు నిద్రపోయాడు. కడుపు బాధ తగ్గిన తల్లీ కూడా, తన పోయినబిడ్డ లేచి వచ్చినంత సంతోషపడి పిల్లవాణ్ణి పక్కలో వేసుకుని అక్కడే వొరిగింది. నిద్రబద్ధకంగా ఉన్న ప్రయాణీకుల కెవరికీ ఈ సంగతి పట్టలేదు. ఏడుపు తగ్గడంతోనే వాళ్లంత నిద్రపోయినారు.

"తమ దయాధర్మభిక్షం అనుకుంటాను దొడ్డమ్మగారు" అన్నాడు రామన్న.

"దయేమిటి నాయనా, చిన్న తనాం నుంచి ఎరుగున్న దాన్ని ఆ మాత్రం చెయ్యకూడదూ" అన్నది ముసలావిడ.

తరువాత రామన్న పడవటాపు మీదికి వెళ్లిహాయిగా చుట్ట కాల్చుకుంటూ కూచున్నాడు.

పడవ చాలాదూరం సాగింది. నెలొడిచింది. చెట్ల ఆకుల్లో నుంచి లేతవెన్నెల మాణిక్యం మీద, పిల్లవాడి మీద పడినది. చల్లని గాలి వీచినది. చలి వేస్తే మాణిక్యం కొంచెం మెదిలి పమిటె కొంగు పిల్లవాడికి సరిగ్గా కప్పి చెయి వేసుకుని పడుకున్నది. కొంచెం మెళుకువ చూసి ముసలమ్మగారు మాణిక్యం దగ్గిర కూర్చుని మళ్లీ ఖబుర్లు వేసినది. మాణిక్యం పడుకునే జవాబు చెబుతున్నది. "మరీ, మాణిక్యం, మీకులంలో, మారుమనువు లున్నాయి కాదూ?"

"ఓకులాన్ని లేవేంవిటండి, ఈ రోజుల్లో?" అని మాణిక్యం పిల్లవాణ్ణి అటునుంచి ఇటు వేసుకుని ఒత్తిగిలి పడుకున్నది.

"జంఝైలె జోతులంగరి" అని పడవవాళ్లు పాడుతున్నారు. మువ్వల కర్ర చప్పుడౌతుంది. ఇలకోడి కూస్తున్నది. పడవ కూడా నడుస్తూనే ఉన్నది.

* * *

తెల్లవారింది. పడవ అజ్జరం రేవులో ఆగిఉన్నది. పైర గాలి హాయిగా విసురుతూన్నది. వాలుపడవ గనుక లాగ నవసరము లేకుండా తెరచాప విప్పితే గాలి విసురికి నడుస్తుందని సరంగు డమానుతాడు లాగుతున్నాడు. టాపు మీద కళాసులు డబడబా చప్పుడు చేస్తున్నారు. మాది రెడ్డి రామన్న కిర్రుచెప్పుల జోడు గట్టుమీదికి విసిరి తనొక్కడు ఓ అంగలో గట్టుమీదికి వెళ్లి జోడు తొడుక్కుని నుంచున్నాడు. అటూ ఇటూ చూసి పడవ వెనకవేపు వెళ్లి "ఎవరోమ్, సరంగు? పడిచెక్క మీంచి కాస్త బల్లెయ్యండి, పిల్లలతో ఆడవాళ్లు దిగాలి" అన్నాడు. బల్ల వేసిన తరువాత మాణిక్యం పిల్లవాణ్ణి బుజం మీద ఓచేత్తోను, కాళ్ల దగ్గిర చీరకుచ్చెళ్ల కొంగు మరో చేత్తోను పట్టుకుని దిగింది. రాత్రి అంతా కొంచెం ఇంచుమించు జాగారం చేసిన ముసలమ్మగారికి చల్లగాలిలో అప్పుడే కాస్త కోడికునుకు పట్టినది. కొంత సిగ్గువల్ల, కొంత అభిమానం వల్ల, మరికొంత ఆవిడ నిద్రపోతూన్న దన్న ఆలోచనవల్ల, మాణిక్యం ఆవిడతో చెప్ప కుండానే పడవ దిగింది. రెడ్డి రామన్న కొంచెం అటుగా వెళ్లి వేకువజామునే ఎక్కడికో వెడుతూన్న మాదిగ వాణ్ణి పిలిచి, "ఆరేయ్, యెంకాయ్, రెండు పలుదోం పుల్ల లందుకోరా" అని అవి కోయిస్తున్నాడు. మాణిక్యం చంటిబిడ్డను వళ్లో వేసుకుని గట్టుమీద పడవలోంచి దింపిన సామాన్లలో ఓపెట్టె మీద కూర్చుంది.

తెరచాప లేచినది. పడవ రేవు విడుస్తూండగా ముసలమ్మ గారికి మెళుకవ కలిగింది. గట్టుమీద తల్లీ పిల్లవాడు, దూరంగా, వేపచెట్టు కింద మాది రెడ్డివారి రామన్న కనబడ్డారు. "శలవండి, దొడ్డమ్మగారు" అన్నది మాణిక్యం. ముక్కు మీద వేలు వేసుకుని నిర్ఘాంతపోయి "మంచిది" అన్నది వైష్ణవావిడ.

మాదిగ వాడితో బండి ఎడ్లసంగతి మాట్లాడుతో గబుక్కుని ఆగి మాణిక్యం దగ్గిరకు వచ్చాడు రామన్న. ఆవిడ చుట్టూ ఏవో సామాన్లలో ఏదో వెదికితే కనబడలేదు. చెయి ఝాడించి వేలు కర్చుకుని, "అన్నన్నా, పాలబుడ్డి మర్చిపోయాం" అని మళ్లుపులో ఉన్నపడవకేసి పరుగెత్తి వెళ్లిపోయాడు. మాదిగవాడు అమ్మగారికి పలుదోంపుల్లలు అందించి బండికోసం వూళ్లోకి వెళ్లినాడు.

కాలవ గట్టుమీద సరుగుడుచెట్లు 'జూంయ్యి' మని సంగీతం పాడుతున్నాయి. లేత మామిడి పూత వాసనలలో ఎక్కడో కోకిల కూస్తున్నది. పాలు తాగుతూన్న పిల్లవాడు మానేసి తలెత్తి తల్లికేసి చూసి బుగ్గలు సొట్టపడుతూ బోసినవ్వులు వెళ్లబోశాడు. ✸

భారతి, జనవరి 1932.